

# కథా కౌముది

## తలాట్టు బొమ్మ సింహప్రసాద్



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

మహారాజు గారి శయన మందిరంలో కెళ్ళిన మహారాణి, పరిచారికలు కెవ్వు కెవ్వుమని అరుస్తూ బయటికొచ్చారు.

వెంటనే మహామంత్రికీ, రక్షణ మంత్రికీ, ఆర్థిక మంత్రికీ అత్యవసర సందేశాలు పంపబడ్డాయి. వాళ్ళంతా ఆగమేఘాల మీద వచ్చేశారు.

ఎవరికీ తమ కళ్ళ మీద నమ్మకం చిక్కలేదు. తాము చూసింది సత్యమో మాయో ఇంద్రజాలమో తేల్చుకోలేక అయోమయావస్థలో కూరుకుపోయారు.

తల్పం మీద శయనించి ఉన్న మహారాజుగారి ‘తల’ లేదు! మొండెం మాత్రమే వుంది!

అసలిది ఎలా జరిగిందో, దీనికెవరు కారకులో లేక మరెవరి మాయో, మంత్రమో తేల్చుకోలేకుండా వున్నారు.

‘‘శత్రుదేశాల గూఢచారులు మహారాజుగారి తల నరికి తీసుకుపోయి వుండొచ్చా?’’ మహామంత్రి ప్రశ్నకు, ‘‘వాళ్ళకేం లాభం?’’ వెంటనే ప్రశ్నించాడు ఆర్థికమంత్రి.

‘‘నరికారంటే నేనొప్పుకోను. దరిదాపుల్లో రక్తంగాని, ఆయుధంగాని ఏమీ లేవు!’’ రక్షణమంత్రి మళ్ళీ పరిశీలించి చెప్పాడు.

‘‘కిరీటం పెట్టుకోవాలంటే తల ఉండాల్సిందే. అదెక్కడుందో వెదికించకుండా మీ పనికిమాలిన మంతనాలేంటి!’’ విసుక్కుంది మహారాణి.

ఇంతలో రాజ వైద్యులు వైద్య శిఖామణి విచ్చేశారు. అన్ని రకాలుగానూ పరీక్షించారు. ''తల లేకపోయినా నాడి ఆడుతోంది. బ్రతికి వున్నట్టే లెక్క!''

''జీవశ్చవంలానా!'' గబుక్కున అనేసి నాలిక్కరుచుకున్నాడు ఆర్థిక మంత్రి.

''తలే లేకపోతే కళ్ళూ చెవులూ ఆఖరికి నోరూ ఉండదు. మాట్లాడక పోతే మానె, తినడానికైనా నోరు లేకపోతే ఎలా!'' సందేహం వెలిబుచ్చింది మహారాణి.

''మెదడు వుండేదీ సదరు తలలోనేగా?'' అని, ఆ వెంటనే, ''మహారాజుగారి రక్షణలో లోపం ఏమాత్రం లేదని ఘంటాపథంగా చెప్పగలను'' ఎక్కడతనని బాధ్యుడ్ని చేసి బలిచ్చేస్తారోనని కంపిస్తూ అన్నాడు రక్షణ మంత్రి.

''మహారాజు గారి రక్షణా, రాజ్య సంరక్షణా మీ చెరో భుజం మీదున్న బాధ్యతలే. అయినప్పటికీ అనూహ్యమూ, మానవాతీతమూ అయిన ఈ ఘటన గురించి నిన్నెవరూ వేలెత్తి చూపలేరు!'' అతడ్ని వెనకేసుకొచ్చాడు మహామంత్రి.

''ముందు తల సంగతి తేల్చండి'' విసుక్కుంది మహారాణి.

''వెతికిస్తే జనానికి తెలిసిపోతుంది. రాజకీయ సంక్షోభం తలెత్తవచ్చు. శత్రుదేశం ఆక్రమించొచ్చు. సైన్యం తిరుగుబాటు చేయొచ్చు...'' మహామంత్రిని ఆపి అన్నాడు రక్షణ మంత్రి. ''మన సైన్యం యావత్తూ నా చెప్పు చేతల్లోనే వుంది. ఒక్కరూ తోక లేపకుండా అందరి తోకలూ ఎప్పుడో కత్తిరించేశా. వాళ్ళనుంచెలాంటి ముప్పూ రాదని హామీ ఇస్తున్నాను. మన ఘోర మారణాస్త్రాల కీలకం ఇదిగో ఎప్పుడూ నన్ను అంటి పెట్టుకుని వుండే ఈ బుల్లి పెట్టెలో వుంది. ఒక్క మీట నొక్కితే చాలు విధ్వంసమే విధ్వంసం అని వాళ్ళకి తెలుసు. మీకూ తెలుసు!'' పరోక్ష హెచ్చరిక చేశాడు.

''వాటి గోల ఆపి నాకొచ్చిన ముప్పు గురించి ఆలోచించండి?'' మహారాణి కోపంగానే అంది.

''మహారాణీ మేడమ్. ఇహ మహారాజు స్థానే మీరే చక్రం తిప్పాలి. మీకు అండగా మేం ముగ్గురం వుంటాం. మన నలుగురం ఒక చతుష్టయ కూటమిగా ఏర్పడి చక్కని చల్లని పరిపాలన అందిద్దాం'' మహామంత్రి మినీ ఉపన్యాసం ఇచ్చాడు.

''మహారాజు గారి తల లేకుండా, ఎక్కడుందో తెలీకుండా ఎలా పాలించగలం!'' లోలోన సంబరపడుతూనే సందేహం వ్యక్తపరిచింది మహారాణి.

''చిన్న తల లేకపోతేనేం పెద్ద మొండెం వుంది. అంటే మూడొంతుల మనిషి– మెజార్టీ భాగం వున్నట్టే లెక్క. పైగా కాళ్ళూ, చేతులూ చక్కగా పనిచేస్తున్నాయి. వైద్య శిఖామణి గారూ, మహారాజు ఇలా ఎన్నాళ్ళు వుంటారు?'' 'బతుకుతారు?' అని ప్రత్యక్షంగా అడగకుండా పరోక్షాన్ని ఎన్నుకున్నారు మహామంత్రి.

''అయిదు రోజులు లేదా అయిదు నెలలు లేదా అయిదేళ్ళు వుండొచ్చు''

''మన ఎన్నికల్లాగా ఈ అయిదు గొడవేంటి!'' కలవరపడ్డాడు ఆర్థిక మంత్రి. ఈసారి ఎన్నికల్లో ఆయనకు డిపాజిట్ దక్కదని ఓ తల మాసిన జ్యోతిష్కుడు చెప్పాడట!

''హమ్మో! అంతదూరమైతే లాభం లేదు. ఇంకో మూడేళ్ళలో ప్రజాభిప్రాయ సేకరణా ఎన్నికలొస్తాయి. అందులో ఏ మంత్రి బృందాన్ని ప్రజలు ఎన్నుకుంటే వాళ్ళే మంత్రి పదవులు చేజిక్కించుకుంటారు. మహారాజు గారి సింహాసనం శాశ్వతం గాని, మా కుర్చీలు అశాశ్వతాలు! అసలే 30% కమీషన్ మంత్రి వర్గం అని దుమ్మెత్తిపోస్తున్నాయి ప్రతిపక్షాలు. రేపేం జరుగుద్దో ఏమో!''

మాటల్లో కించిత్తు వేదాంత ధోరణి కనబర్చాడు మహామంత్రి. లోలోన మాత్రం 'రాజ్యంలో అవినీతి పడగవిప్పి బుసలు కొడుతోందని చెప్పి మా మంత్రివర్గాన్ని బర్తరఫ్ చేయాలని చూసినందుకు మహారాజుకు తగిన శాస్తి జరిగింది' అనుకుంటూ సంబరపడ్డాడు.

అందరి ముఖాలూ పాలిపోయాయి. కుర్చీలు కదులుతున్నట్టన్పించి గట్టిగా పట్టుకున్నారు ముగ్గురూ.

''పురాణాల్లో ఏనుగు తల తెచ్చి వినాయకుడికి అతికారుగా. అలా చేయలేరా వైద్య శిఖామణీ'' ఆశగా అడిగింది మహారాణి.

''అబ్బే ఏనుగు తల చాలా బరువుంటుంది. మోయలేక చచ్చూరుకుంటారు...'' పెదవి విరిచాడు.

''పోనీ కుక్క, నక్క, పిల్లి, మేక, లేడి వగైరాలవైతే?''

''ఛీ ఛీ. వాటితో నేనెలా కాపురం చేస్తాను?'' మొహం అసహ్యంగా పెట్టింది మహారాణి.

''కాపురం కోసం ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిద్దాం మేడమ్. మీకు నచ్చే నవయువకులు, కండల వీరులు మన అంత:పురంలో, ఆస్థానంలో చాలా మందే వున్నారు...''

మహామంత్రి మాటలు వింటూనే మహారాణి పక్కకు చూసింది. రక్షణమంత్రి కాలర్ సవరించుకున్నాడు. వారిద్దరి కళ్ళూ కలుసుకోవడం మహామంత్రి కళ్ళల్లో పడిరది. హడలిపోయాడు. వాళ్ళిద్దరూ 'కాళ్ళు' కలిపితే మొదటొచ్చి పడేది తన పదవీ గండమే!

''సీరియస్ విషయం పక్కదార్లు పడుతోంది'' సన్నగా హెచ్చరించాడు ఆర్థికమంత్రి. అతడి వంక కృతజ్ఞతగా చూశాడు మహామంత్రి.

''ఎవరిదైనా మనిషి తల తెచ్చి అతికిస్తే?'' పరమానందం దాచుకుంటూ అడిగింది మహారాణి.

''ఉరిశిక్ష పడ్డ ఖైదీ తల నరికి అతికించొచ్చుగాని వారంతా గజదొంగలూ దోపిడీ దొంగలూ. పైగా వారి మెదడే శరీరాన్ని కంట్రోలు చేస్తుంది గనుక మనల్నందర్నీ నిలువు దోపిడి చేసి, రాజ్యాన్ని హైజాక్ చేస్తాడేమోనని నా భయం!'' మహామంత్రి నిజంగానే భయపడ్డాడు. హనుమంతుడి ముందు తన కుప్పిగంతులు సాగవు కదా!

''అవునవును. బొక్కిందీ దాచిందీ బినామీ పేర్లమీద పెట్టిందీ కక్కమంటే అందరికీ చచ్చే చావు వస్తుంది. ఇప్పుడున్నట్టే సాగిపోవడం ఉత్తమం'' అభిప్రాయపడ్డాడు ఆర్థికమంత్రి.

''అదీ నిజమే. ఉరి శిక్ష పడ్డ ఖైదీలంతా మహా దోపిడీ దొంగలే. మన ఖజానా ఆనుపానులన్నీ వారికి బాగా తెలుసు. వారిని నమ్మకూడదు'' ధాటీగా చెప్పాడు రక్షణమంత్రి.

''చర్చ కాస్త ఆపుదాం. వైద్య శిఖామణీ, మేం రాజకీయ వ్యూహం రచించుకోవాల్సి వుంది. మీరెళ్ళిరండి. రోజుకి రెండుసార్లు వచ్చి మహారాజు గారి మొండేన్ని చూడండి. దాన్ని మాత్రం చక్కగా 'సజీవం'గా వుంచే బాధ్యత పూర్తిగా మీదే''

అతడెళ్ళేక అన్నాడు మహామంత్రి. ''మహారాజు గారి తర్వాత మహారాణి వారే మన మహారాజు. వారిని సింహాసనం మీద కూర్చోబెట్టి మహారాజు గారి పేరుతోనే పరిపాలన సాగిద్దాం''

''ఈ రాజకోట రహస్యం జనానికి తెలిసిపోతే?'' మహదానంద పడిపోతూనే భయం నటించింది మహారాణి.

''అది గాని, మహారాజు గారి తల మాయమవ్వడం గాని, మరో నర మానవుడికి తెలీకుండా కఠిన జాగ్రత్తలు తీసుకుంటాం. మీకు పెద్ద పీటవేస్తూ, మేం ముగ్గురుమూ కలిసి ముఖ్య నిర్ణయాలు తీసుకుంటూ రామరాజ్యం తీసుకొస్తాం'' అన్నాడు మహామంత్రి గడ్డం సవరించుకుంటూ.

''అది నా రాజ్యం కాదా?'' ఆందోళనపడింది మహారాణి.

''మీ రాజ్యమే. మీరు పొరబాటుగా విన్నారు. నేను రామరాజ్యం అనలేదు రమారాజ్యం అన్నాను. మీ పేరు రమామణి కదా!'' నాలిక మడతపెట్టాడు మహామంత్రి.

తప్పట్లు కొట్టారంతా. మురిసిపోయిందామె.

" ఇంతటితో ఆగం. పాత రాజభవనాన్ని కూల్చి ఆధునిక హంగులతో పెద్ద కోట కడతాం. అది రమామణి కోటగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అలాగే శిథిలావస్థకు చేరుకున్న కొన్ని పురాతన భవనాల్ని, ఒక గుడిని, ఒక చర్చిని, ఒక మసీదుని ఆధునీకరించి మీ పేరు ఎప్పుడూ ఎవరూ మరిచిపోలేని విధంగా, ముందు తరాల వారు పదేపదే చెప్పుకునేలా శిలాక్షరాలతో రాయిస్తాం!"

మహామంత్రి మాటలకు ఉబ్బి తబ్బిబ్బయింది మహారాణి. "కమీషన్లు గుంజుకోడానికే అనవసరమైనవన్నీ చేస్తున్నారని జనం అనుకుంటారేమో? జనం గోడు పట్టించుకోవట్లేదని విమర్శిస్తారేమో?!!"

" జనం గురించి భయపడొద్దు. మనం కొత్తగా ఏం చెప్పినా, చేసినా గంగిరెద్దులా తలూపేస్తారు. వాళ్లు మన పనుల్ని పాలనని మౌనంగా తలాడిస్తూ ఆమోదిస్తారు. ఆపైన చచ్చినట్టు సమర్థిస్తారు. కాదంటే మధ్యమధ్య ఒక మాంసం ముక్క విసురుతూ ఉండాలి. నిజం చెప్పాలంటే అవినీతి అనేది పరిపాలనలో ఒక భాగం అయిపోయిందని సరిపెట్టుకుంటున్నారు. అందుకనే మనల్ని, మనలాంటి వాళ్ళని, ఆమోదించి ఓట్లు వేసిమరీ గద్దెనెక్కిస్తున్నారు! ఇది ప్రపంచమంతటా ఉన్న పరిస్థితే ! మనమేం ప్రత్యేకం కాదు, మినహాయింపూ లేదు!"

" జనం వట్టి గొర్రె మందులు!" వ్యాఖ్యానించాడు రక్షణ మంత్రి.

‘‘అలాగని చెప్పి నిమ్మకి నీరెత్తినట్టు కూర్చుంటే కుదరదు. పరిస్థితి వికటించవచ్చు. మనం ముందుగా ప్రతిపక్షాల, ప్రజల అటెన్షన్నీ, దృష్టినీ అవినీతి మీంచి, అధిక ధరల మీంచి, నిరుద్యోగం మీంచి మళ్ళించాలి. అర్జెంటుగా దానికో అద్భుత అయిడియా కావాలి’’ ఆర్థిక మంత్రి చెప్పాడు.

‘‘మహారాజు గారి తల త్వరగా దొరకాలని, వారికి వేగంగా స్వస్థత చేకూరాలని ఆశిస్తూ చండీయాగం చేస్తాను. నా పాతివ్రత్య మహిమ ఎంతటిదో మొత్తం ప్రపంచ ప్రజానీకానికి తెలియజేస్తాను!’’ చిన్నగా ఆవేశపడింది మహారాణి.

‘‘భేష్ భేష్’’ పొగిడేశారంతా.

‘‘దాన్ని భారీ ఎత్తున నిర్వహిద్దాం. మూడు నెలలకు పొడిగిద్దాం. దానికి ఎన్ని టన్నుల సమిధలు, ఆవునెయ్యి కావాలో, ఎందరు ఋత్విక్కులు వస్తారో, వారికి ఎలాంటి ఏర్పాట్లు చేస్తామో , వీక్షించడానికి ఏఏ స్వదేశీ విదేశీ ప్రముఖులు వస్తారో, మొత్తం ఖర్చు ఎంత అవుతుందో విడతలుగా సమాచారం మనమే లీక్ చేద్దాం . ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ప్రతిపక్షాలు మండిపడతాయి. కొందరు ఆందోళన బాట పడతారు. ఇహ మీడియాలు యాగ విశేషాల కవరేజ్‌కీ పోటీపడతాయి. పత్రికల నిండా, టీవీ నిండా, యూట్యూబ్ నిండా అవే వార్తలు! దాని గురించే చర్చలూ సంపాదకీయాలూ! దెబ్బకి జనం మనది 30% కమీషన్ మంత్రివర్గమన్న సంగతి పూర్తిగా మర్చిపోతారు’’ చిద్విలాసంగా నవ్వాడు మహామంత్రి.

‘‘ఇది ఐడియా కాదు బ్రహ్మాస్త్రమే. దీనికి తిరుగుండదు. ధనం గురించి ఆలోచించొద్దు. దేశవిదేశీ ప్రసార సంస్థలకు యాగ కవరేజ్ హక్కులు వేలం వేసి అమ్ముదాం. ఇక మన వాణిజ్యవేత్తలు స్వచ్ఛందంగా ట్రక్కుల్లో అన్ని సరుకులూ తెచ్చి కుమ్మరిస్తారు’’ భరోసా ఇచ్చాడు ఆర్థికమంత్రి.

‘‘అంతా బాగానే వున్నట్టు కనిపిస్తోంది గాని, ఎప్పుడైనా ఎవరి ద్వారానైనా మహారాజు గారి తల రహస్యం లీకైతే మొదట నా తల తెగి నేల మీద పడుతుంది!’’ గుండెల్ని తొలుస్తున్న వేదన కక్కేశాడు రక్షణమంత్రి.

‘‘వూరికే భయపడి చావకు. మనం మహారాజు గారి వీర భక్తులం తప్ప రాజ్య ద్రోహులం కాదు. అదీగాక మహారాజు గారికి తల వుండేదన్నమాట నిజమే గాని అందులో పనికొచ్చే ‘గుంజు’ ఏమీ లేదు. వూరికే రాజ్యం, జనం, అభివృద్ధి, ఉన్నతి, ప్రగతి, సంక్షేమం, సంతోషం `అంటూ ఏవో కొన్ని చిలకపలుకులు వల్లించేవారంతే’’ తేలిగ్గా తేల్చేశాడు మహామంత్రి.

‘‘మీకు తెలీదు గాని అవన్నీ నేను నేర్పినవే’’ గొప్పగా చెప్పింది మహారాణి.

‘‘గ్రేట్. కానవన్నీ ఉత్తుత్తి మాటలనీ అవేవీ అమలవ్వవని ఆయనకి తెలుసు, మనకు తెలుసు, జనానికీ తెలుసు. అయినా అభిప్రాయ సేకరణ కోసం జరిపే ఎన్నికల్లో మన సొల్లు వాగుడు, ఉత్తుత్తి వాగ్దానాలు నమ్మినట్టు నటిస్తూ ఏదో ఒక టీమ్‌ని జనం ఎన్నుకుంటున్నారు . ఈసారి మన పంట పండిరది. మనం మంత్రులమయ్యాం. మనం దీన్ని శాశ్వతం చేసుకోవాలి. మన తరువాత మన వారసులే ఈ కుర్చీలకు వారసులయ్యేలా వ్యూహాలు రచించాలి! అవసరమైతే రాజ్యాంగ

సవరణలు చేయాలి! ఒకసారి చేజారితే మళ్ళీ మనల్ని సింహాసనం దరిదాపులకు రానివ్వరు!'' మళ్ళీ గడ్డం నిమురుకున్నాడు మహామంత్రి.

''ఇదే ఇదే కావాలి. మా మనసులోని మాట భలే చదివేశారు'' జంటగా మెచ్చుకున్నారు ఆర్థికమంత్రీ, రక్షణ మంత్రీ.

''మరి నా సింహాసనం?'' బెదురు చూపులు చూస్తూ అడిగింది మహారాణి.

''అది మీదీ మీ వారసులదీ అని సింహాసనం మీద ఉలితో చెక్కిస్తాం. ఇక మీరు మరో ఎలిజబెత్ మహారాణి అయిపోయినట్టే''

''వావ్'' అమాంతం లేచి ముద్దు పెట్టుకోబోయే మహామంత్రి గడ్డం మీసాలు చూసి బెదరి ఆగిపోయింది.

చతుష్టయం పరమానంద పడింది. చేతులు కలుపుకుంది. హాస్యగాండ్ల జోకుల మధ్య విందు భోజనం తృప్తిగా ఆరగించింది.

వెళ్ళబోతూ ఆగి మహారాణి ముందు కెళ్ళాడు రక్షణ మంత్రి. ''మీకెప్పుడు ఎలాంటి అవసరమొచ్చినా నాకు కబురు పంపండి మహారాణీ మేడమ్. నేనొచ్చి వాలిపోతాను. మీకు మహారాజుగారు చెప్పే వుంటారు. నేను వారి పెట్‌ని. స్వకులాభిమానంతో కావాలనే నాకు రక్షణ మంత్రిత్వ శాఖ కట్టబెట్టారు''

గుర్రుగా చూశారు మిగతా ఇద్దరూ.

వాహనం ఎక్కే ముందు, ''రక్షణ మంత్రి మీద మనం ఒకటి కాదు రెండు కళ్ళూ వేయాలి. ఆవిడా అతగాడూ చేతులు కలిపితే మన స్థానాలు గల్లంతే !'' చెప్పాడు మహామంత్రి.

''మహారాజు గారి తల దొరకనంత వరకూ అతడి పిలక మనచేతి లోనే వుంటుంది. తల మాయం వెనుక అతడి కుట్ర వుందేమోనని నా అనుమానం''

''ష్. గట్టిగా అనకు. వాడి అస్మదీయులు వింటారు జాగ్రత్త''

భారీ చండీయాగం అట్టహాసంగా ప్రారంభమైంది.

మహారాణి రోజుకో కొత్త డిజైన్ పట్టు చీర కట్టుకుని, దానికి మ్యాచయ్యే నగలు ధరించి మరీ యాగం చేస్తున్నారు. యాగం కన్నా ఆ చీర ప్రత్యేకత, నగల డిజైన్, వాటి విలువ వగైరాల చర్చ మీడియాలో ఎక్కువైంది.

''తుమ్మొచ్చినా, దగ్గొచ్చినా పూజలూ, వ్రతాలూ, హోమాలూ చేసే మహారాజుగారు ఈ యాగంలో ఎక్కడా కన్పించరేంటి చెప్మా?'' ఒక ప్రశ్న జనంలో తలెత్తింది. కొన్ని గంటల్లో శాఖోపశాఖలుగా విస్తరించింది.

''మహారాజు గారు క్షేమంగా వున్నారా లేదా? 30% కమీషన్లగాళ్ళ చేతుల్లో ఆయన బందీ కాలేదు కదా? అసలు రాజభవనంలో ఏం జరుగుతోంది? ఇప్పుడు పరిపాలిస్తోంది మహారాజా లేక మహారాణా లేక మంత్రులూ వారి మిత్ర కాంట్రాక్టర్లూ వాణిజ్య వేత్తలా?'' జనం గొంతెత్తసాగారు.

అది సుడిగాలిగా మారసాగింది.

చతుష్టయం సమావేశమైంది. వెంటనే ఒక ఆర్డినెన్సు జారీ అయింది.

''రాజ్యానికి వ్యతిరేకంగా ఎవరూ వాక్కు, అక్షరం, బొమ్మ, దృశ్యం ఎక్కు పెట్టడానికి వీల్లేదు. విమర్శించినా తూలనాడినా కించపరిచినా అది రాజద్రోహమే అవుతుంది. దానికి కారాగార శిక్ష విధింపబడుతుంది''

రాత్రికి రాత్రే కొందర్ని లాక్కెళ్ళి జైల్లో పడేసి 'హమ్మయ్య' అనుకున్నారు.

కాని తెలివి మీరిన జనం ప్లకార్డులు చేబూని మౌన ఊరేగింపులు జరుపుతూ నిరసన తెలియజేయసాగారు.

చతుష్టయం ఒళ్ళు ఎర్రచీమలు పాకినట్టు చిర చిరలాడింది. ఆ పైన మండిపోయింది.

''పబ్లిక్ రోడ్ల మీద మైదానాల్లో అక్కడా ఇక్కడా కాదు ఎక్కడైనా సరే బహిరంగ సభలూ సమావేశాలూ ఊరేగింపులూ  నిషిద్ధం'' ఫర్మానా జారీ చేశారు.

'స్టిక్' ఝుళిపించడమే కాదు 'క్యారట్టూ'  విసిరారు.

''ప్రభుత్వాన్ని కీర్తిస్తూ పాటలూ, పద్యాలూ రాసిన వారికీ, పాడిన వారికీ సినిమాలు తీసిన వారికీ లక్షల్లో క్యాష్ అవార్డులు, బిరుదులు, పదవులు ఇవ్వబడతాయి''

ఆ ప్రకటన వెలువడటం ఆలస్యం పత్రికల్లో టీవీల్లో సినిమాల్లో 'భజన' కార్యాక్రమాల జోరు పెరిగింది. సగం తీసిన సినిమాల్లో కూడా వాటిని ఇరికించడం మొదలుపెట్టారు.

''ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా నేనెంతో ప్రతిష్ఠాత్మకంగా చేస్తున్న మహా చండీయాగం చూడటానికి పత్రికల వాళ్ళూ, టీవీ వాళ్ళూ తప్ప జనం రావట్లేదు. వచ్చిన కాసిని మందీ ఏడుపు గొట్టు మొహాల్తో వుంటున్నారు. నిజంగా మీ పాలన ఇంత దరిద్రగొట్టుగా వుందా?'' ప్రథమంగా మంత్రిత్రయాన్ని నిలదీసింది మహారాణి.

''ఇదిగో ఇవాళే విరుగుడు మంత్రం వేసేస్తాం!'' అన్నారు.

ఆ మర్నాటి నుంచి ఇళ్ళల్లో, రోడ్ల మీద, ఆఫీసుల్లో ఉదయం 8 గంటల్నుంచి 8.30 గంటల వరకూ ఎక్కడి వారక్కడే ఎలావున్న వారలాగే నిలబడిపోయి పగలబడి నవ్వాలని ఆదేశమిచ్చారు.

ఈ నవ్వుల థెరపీ జనం ఆనంద ఆరోగ్యాల కోసం చేపట్టిన విప్లవాత్మక కార్యక్రమం అని మంత్రులు ముగ్గురూ ఒకేసారి బల్లగుద్ది మైకుల్లో అరిచారు.

ఆ కార్యక్రమంతో బాటు మరో జీవో కూడా ఇచ్చారు.

జనం బహిరంగ ప్రదేశాల్లో బాధా మొహాల్తోనూ, ఏడుస్తూనూ వుండకూడదు. అలాంటి ఫోటోలు, వీడియోలు, సీరియళ్ళు, సినిమాలు  నిషిద్ధం. వాటిని తీయడమే కాదు ఇతరులకు చూపడం, ఫార్వర్డ్ చేయడమూ నేరమే. సినిమాల్లోనే కాదు నాటకాల్లో పాటల్లో కథల్లో  ఎక్కడా బాధ, దు:ఖం కనిపించకూడదు, వినిపించరాదు. అతిక్రమించినవారు

ఉద్యోగులైతే ఉద్యోగం వూడుతుంది. నిరుద్యోగులైతే ప్రభుత్వ ఉద్యోగం రాదు, వ్యాపారస్తులైతే లైసెన్సు రద్దవుతుంది. ఇతరులైతే జైలు శిక్ష అనుభవించాలి!

జనం మింగలేక కక్కలేక వీధిలో నవ్వుతూ, ఇంట్లో ఏడుస్తున్నారు. ఏడ్చి ఏడ్చి విసిగిపోయారు. తెగింపు తలెత్తింది.అది ఆగ్రహంగా రూపుదిద్దుకో సాగింది.

ఇదేమీ గ్రహించని మంత్రులు, మహారాణి 'అంతా సజావుగానే సాగుతోంది' అని సంబరపడుతూ విందు వినోదాల్లో మునిగి తేలసాగారు.

''అన్నీ వున్నా అయిదోతనం లేనట్టైపోయింది నా బతుకు. అర్జంటుగా ఏదో ఒక మనిషి తలకాయ తెచ్చి మహారాజుగారి మొండేనికి తగిలించాల్సిందే'' హఠాత్తుగా అల్టిమేటం ఇచ్చేసింది.ఒకరోజున భీష్మించింది మహారాణి.

సరిగ్గా అప్పుడే నిరసన జ్వాలలు వూపందుకున్నాయి.

''మహారాజు గారెన్నడూ జనం గొంతుమీద బూటుకాలు పెట్టి తొక్కలేదు. కళ్ళకు గంతలు కట్టలేదు. చెవుల్లో సీసం పోయలేదు. ఆయన మహానుభావుడు. కానిప్పుడు పరిపాలన ఇలా అడ్డదిడ్డంగా సాగుతోందంటే ఇదంతా మహారాణితో కలిసి మంత్రులు పన్నిన కుట్రే. మహారాజు గారినేదో చేసేసి వుంటారు. అందుకే ఆయన ముఖం టీవీలో కూడా కనిపించడం లేదు...'' అంటూ సామాజిక మాధ్యమాల్లో ఎన్నో విమర్శలు వెల్లువెత్తాయి.

''మహారాజు దర్శనం ఇవ్వాలి'' అంటూ పోస్టర్లూ వెలిశాయి.

బెంబేలెత్తిపోయింది చతుష్టయం. జన వ్యతిరేకతకు అడ్డుకట్ట వేయకపోతే తదుపరి ఎన్నికల్లో డిపాజిట్ గల్లంతవడం ఖాయమనుకున్నారు.

'ఒక పనికి రెండు లాభాలు' అని చంకలు గుద్దుకుంటూ మరణ శిక్ష పడ్డ ఖైదీల్లో మహారాణికి నచ్చిన ముఖం గల తలని తెచ్చి మహారాజుగారి మొండేనికి అమర్చడానికి నిశ్చయించుకున్నారు.

"వాడు మహా గజ దోపిడీ దొంగ. అయిన వాళ్ళనీ చంపి దోచుకున్న చరిత్ర వాడిది'' అడ్డుపడ్డాడు రక్షణ మంత్రి.

వీటో చేసేసింది మహారాణి.

వైద్య శిఖామణి వచ్చి సర్జరీ పూర్తి చేశారు. జీవం వచ్చిన మహారాజు మొండేన్ని చూసి పరమానందపడిపోతూ కావలించుకుంది మహారాణి.

సినిమా మేకప్ వారిని తీసుకొచ్చి దొంగ ముఖాన్ని మహారాజు గారి ముఖంగా 'తయారు' చేయించారు. ఆ వెంటనే టీవీలో కనిపించాడు.

''మీకు మంచి కాలం తీసుకొస్తాను. నాదీ హామీ. మీరిహ నిశ్చింతగా వుండండి'' అని దొంగ మహారాజు చేత వల్లింపజేశారు. మిగతాది మహారాణి మేనేజ్ చేసింది.

ఆవిడ ముదురుతోందని మిగతా ముగ్గురికీ అర్థమైంది. ఏదైనా కాదంటే త్రోసిరాజనేస్తుందేమోనన్న భయమూ కలిగింది. ఆవిడకిప్పుడు అండగా మహా గజ దోపిడీ దొంగ అంటిపెట్టుకుని ఉన్నాడాయె !

ఇదే సరైన సమయం అనుకుంటూ రక్షణ మంత్రి బిగ్గరగా చెప్పాడు. ''మహారాజుగా ఒక శాల్తీ ఉంది గనుక, ఇక నుంచి మీరు మా మహా మహా చక్రవర్తే!''

మిగతా ఇద్దరూ ఏడవలేక నవ్వారు.

రక్షణ మంత్రిని చాటుగా పిలిపించింది మహారాణి. ''మహామంత్రి ముసలివాడైపోయాడు. ఒకటో రకం అవినీతిపరుడని జనం అసహ్యించుకుంటున్నారు. అందుచేత ఆయన్ని తీసేసి మిమ్మల్నా పదవికి నామినేట్ చేస్తాం''

పొంగిపోయి అమాంతం పాదాల మీద పడిపోయాడు.

'' ఖజానా తాళాలు ఇలా ఇవ్వు'' ఆజ్ఞాపించింది.

నమ్మినబంటులా ఇచ్చేశాడు.

''మన మహారాజ్య కీర్తి ప్రతిష్ఠల్ని దేశ దేశాలకు తెలియబర్చడానికి ప్రపంచ పర్యాటన చేసొస్తాం''

మహారాణి తన అభిప్రాయం వెలిబుచ్చడం ఆలస్యం ఎయిర్ బస్ విమానం రెడీ చేశారు. దొంగ మహారాజు సలహా ప్రకారం రహస్యంగా ఖజానాలోని ధనరాశుల్ని, అంత:పురంలోని బంగారాన్నీ విమానం ఎక్కించేశారు.

వార్త ఆఖరి క్షణంలో రక్షణ మంత్రికి తెలిసింది. పరుగున వెళ్ళి విమానం తలుపు మూసుకొంటోంటే గబుక్కున దూరేశాడు. చేతిలోని మారణాస్త్రాలు తాలూకు బటన్స్ వున్న పెట్టెని అమాంతం లాగేసుకున్నాడు సేనాధిపతి. దాన్ని తీసుకెళ్లి మహామంత్రికిచ్చి తన విధేయత చాటుకున్నాడు .

గడ్డం నిమురుతూ నవ్వాడు మహామంత్రి. వెంటనే సైన్యాధికారిని క్యాబినెట్ ర్యాంకుతో నిఘా సంస్థకి చైర్మన్ చేసేశాడు . ఆ వేడిలోనే సైన్యంలో జూనియర్ పొజిషన్లో వున్న తమ్ముడ్ని సైన్యాధికారిని చేసేశాడు. రక్షణ శాఖ మాత్రం తన దగ్గరే వుంచుకున్నాడు.

ఆర్థిక మంత్రి ముఖం ముడుచుకోవడంతో అతడి కూతుర్ని సహాయ మంత్రిని చేసి సాంస్కృతిక శాఖ ఇచ్చాడు. దాన్ని బ్యాలెన్స్ చేయడానికా అన్నట్టు తన కొడుకుని 'తర్ఫీదు కోసమంటూ' మరో సహాయ మంత్రిని చేసి వాణిజ్య శాఖ అప్పగించాడు.

ఈ మార్పు చేర్పులేంటో ఎందుకో జనానికి అర్థం కాలేదు. రహస్యంగా ఏదేదో జరుగుతోందని ప్రజలు భావించారు. మెల్ల మెల్లగా వారి ఆగ్రహం అధికమవసాగింది. ఏదో రోజున విరుచుకుపడతారని భయపడిపోయాడు ఆర్థిక మంత్రి.

''మైహూనా'' నవ్వాడు మహామంత్రి.

ఆ మర్నాడు విదేశీ విహారయాత్రలోని దొంగ మహారాజు, మహారాణి సన్నిహితంగా వున్న ఫోటోలు కొన్ని పత్రికల్లో ప్రత్యక్షమయ్యాయి.

''అతడు మన మహారాజు కాదు. మహా గజ దోపిడీ దొంగ. అతడితో మహారాణి రాసలీలలా. ఛీ ఛీ....''

మరో రోజున, ''ఖజానాలోని సోమ్మంతా మహారాణీ, రక్షణ మంత్రీ కాజేసి విమానంలో పట్టుకుపోయారట!'' వార్త వచ్చింది.

ఆ తర్వాత, ''ఫలానా దీవిలో దొంగ మహారాజు, మహారాణి, రక్షణ మంత్రి స్థిర నివాసం ఏర్పరచుకోడానికి దరఖాస్తు చేశారు'' అంటూ న్యూస్ చక్కర్లు కొట్టింది.

''మీ గోబెల్స్ ప్రచారానికి మహారాణీ మహారాజూ మీమీద మహా ఆగ్రహంగా వున్నారు. మేం తిరిగి వచ్చేస్తున్నాం. మీ తల తెగి పడటం ఖాయం!'' రక్షణ మంత్రి హెచ్చరించాడు.

''త్వరగా రండి. మీ కోసమే ఎదురు చూస్తున్నాం. పాత మహారాజు తల దొరికింది. మీరే మహారాజుని చంపి, తలని అడవిలో పారేశారని జనం విశ్వసిస్తున్నారు. మీ ఇద్దర్నీ సజీవ దహనం చెయ్యాలని ఉవ్విళ్ళూరుతున్నారు''

అంతే, ఆ తర్వాత అతడి గొంతు మూగబోయింది. వారికి సంబంధించిన ఒక్క వార్తా బయటికి రాలేదు!

మహామంత్రి టీవీలో ప్రత్యక్షమయ్యారు.

''మన ప్రియమైన మహారాజుగారిని మహారాణి, మాజీ రక్షణ మంత్రి కలిసి చంపేశారు. కుట్ర పన్ని మహారాజు తలనీ మాయం చేసేసి, రహస్యంగా మహా గజ దోపిడి దొంగ తలని తెచ్చి అతికించారు. ఆ పని చేసింది తనేనని వైద్య శిఖామణి అంగీకరించారు. వారిని ఖైదు చేసి నిజ నిర్ధారణకు విచారణ కమిటీ నియమించాం. అంతే కాదు ఎన్నో క్రూర చట్టాలు చేయడానికీ, ప్రజల మీద మరెన్నో ఆంక్షలు విధించడానికీ, జనం బాధలకూ నిర్బంధాలకూ, అక్రమ శిక్షలకూ, అన్యాయ సుంకాలకూ కారకూలు వారిద్దరే. దాన్ని నిరూపించే రాజ పత్రాలు నా దగ్గరున్నాయి. త్వరలో వాటిని మీ ముందు పెడతాను.

పాత రాజు బూజు దులిపి రాజ్యాన్ని శుద్ధి చేయడం దేశభక్తులుగా మన తక్షణ కర్తవ్యం.

రాజు లేని రాజ్యం తల లేని మొండెమే అవుతుంది. గాలికి వదిలేసిన పాలన గాడి తప్పుతుంది. దేశాభివృద్ధి కుంటుబడుతుంది. విదేశీ శత్రువుల నుండి ప్రమాదం పెరుగుతుంది. అందుకని నేను మహారాజుగా, ఆర్థిక మంత్రి మహామంత్రిగా ఈ ఉదయమే దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేశాం. మా అబ్బాయి రక్షణ మంత్రిగా, వీరమ్మాయి ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తారు. రేపు లక్షలాది మందితో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నాం. ఈ కొత్త మహారాజు పాలన మిమ్మల్నెంత ఆనంద ఐశ్వర్యాల్లో ముంచుతుందో మీ కెన్నెన్ని కొత్త కొత్త సౌకర్యాలూ, సౌభాగ్యాలూ సమకూరుస్తుందో రేపు చెబుతాం. జై మహారాజ్యం! జైజై మహారాజ్యం!''

ఇది నిజమో, అబద్ధమో, మాయో డిజిటల్ గ్రాఫిక్ వర్కో జనానికి అర్థం కాలేదు. అయినా ఎంతో మంచి కాలం రాబోతోందన్న ఆశతో జనం ఎవరికి వారే లక్షల్లో తరలివచ్చారు.

ఇంద్ర సభలా తీర్చిదిద్దిన వేదిక మీద రాజదండం చేతబూని కొత్త మహారాజు, కొత్త మహామంత్రి, కొత్త రక్షణ మంత్రి, కొత్త ఆర్థిక మంత్రి ఆశీనులయ్యారు.

కొత్త మహారాజు గొంతు సవరించుకున్నారు.

''మహాజనులారా, మీకందరికీ మా శుభాశీస్సులు. పాత రోత విరగడయ్యింది. మాతో కొత్త పాలనే కాదు నూతన శకం ఆరంభమైంది. జనానికి మంచి రోజులు వచ్చాయి. ప్రపంచంలోని ఏ దేశమూ తమ జనానికి చేయని, చేయలేనన్ని మేళ్ళు మీకు చేస్తాం. అవేంటో చదివి వినిపిస్తాను సావధానంగా వినండి.

రేపటి నుంచి మీకు అన్నం ఉచితం కూరలు ఉచితం, పచ్చళ్ళు ఉచితం, పాలు ఉచితం దుస్తులు ఉచితం, ఇళ్ళు ఉచితం. ఇంటర్నెట్ ఉచితం. టీవీలో సినిమాలు ఉచితం. సీరియళ్ళు ఉచితం. ఇన్కంటాక్సు, వెల్త్ టాక్సు వగైరా టాక్సులన్నీ రద్దు చేసేశాం. ఇకపై ఒకే ఒక కొత్త టాక్సు చెల్లిస్తే చాలు. మీకిక ఇన్కమ్ టాక్స్ లెక్కల రంధీ కూడా వుండదు. ఇంకో ముఖ్య సంగతి. మీరిహ మీ విలువైన సమయాన్ని వృధా చేసుకుంటూ ఓటు వెయ్యడానికి క్యూలో నిలబడాల్సిన అగత్యం లేకుండా ఎన్నికల్ని పూర్తిగా రద్దు చేసేశాం. మీకు కంటిన్యూవస్‌గా ఈ ఉచితాలన్నీ అందించడానిగ్గాను ఎంత ఖర్చయినా భరిస్తాం. ఇందుకోసం ఎంత దూరమైనా వెళ్తాం. ఎన్ని అప్పులైనా చేస్తాం. రాజ్యఆస్తుల్ని ఆఖరికి రాజ భవనాన్ని కూడా దేశ విదేశీ బ్యాంకులకు తణఖా పెట్టి అయినా అప్పులు తేవడానికి వెనుకాడం. అవసరమైతే మా తలల్నీ తాకట్టు పెడతామని హామీ ఇస్తున్నాం. అంతే తప్ప, ఈ ఉచితాలు చచ్చినా ఆపబోమని గట్టిగా మనవి చేస్తున్నాం. ...!''

జనం ఆనందోత్సాహాలతో చిందులేశారు. మహారాజుకి జై అంటూ నినాదాలు చేస్తూ బ్రహ్మ రథం పట్టారు. ఆ దృశ్యం చూసి కొత్త మహారాజు, మహామంత్రి, మిగతా మంత్రులు తాము, తమ పాలన ఈ భూమ్మీద శాశ్వతం అనుకోకుండా ఉండలేకపోయారు.

''ఇక తినడం, తాగడం, దొర్లటమేరా మన పని . అన్నీ ఊరికే వచ్చి మన ఒళ్ళో పడతాయి. మనమింక పనీ పాటా చేయనక్కర్లేదు. హాయిగా ఇంట్లో కూర్చుని ఎంజాయ్ చేయడమే.. అటువంటప్పుడు ఇక్కడ కూర్చుని ఈ సొద వినడం ఎందుకు దండుగ ! లేవండిరా పోదాం!'' అన్నారు మూకుమ్మడిగా.

అంతా లేచి పొలోమంటూ వెళ్ళిపోతుంటే మహారాజుకు కాళ్లూ చేతులూ ఆడలేదు. “ కూర్చోండి కూర్చోండి. మీరు పంచరత్నాల కోసం ఉద్యోగమో, సద్యోగమో. కూలో నాలో మరోటో మరోటో చేసి సంపాదించాలి!'' అన్నారు కొత్త మహామంత్రి.

''ఆ రత్నాలు మాకు వద్దంటే?'' ఒకరు అడిగారు.

''అది మీ ఇష్టం. కానీ సుఖంగా బతకాలంటే కొన్ని కొనుక్కోక తప్పదు'' ' మహారాజు గడ్డం నిమురుతూ మందహాసం చేస్తూ చెప్పారు.

''అవేంటో త్వరగా చెప్పండి మహాప్రభో'' ఎన్నో గొంతులు అడిగాయి.

తన ట్రేడ్ మార్క్ చిద్విలాసం చేశారు కొత్త మహారాజు.

''మీరు బాగా శ్రమించి డబ్బు సంపాదించాలి. దేని కోసమంటే మద్యం, విద్య, వైద్యం, ప్రయాణం – . ఇవన్నీ కార్పొరేట్ల చేతుల్లో వుంటాయి. గనుక కొనుక్కోక తప్పదు. మన రాజ్య ఖజానాని ఆ దేశ ద్రోహులు దోచేసి పట్టుకుపోయారు గనుక రోడ్లు, పరిశ్రమలు, రైళ్ళు, ఆసుపత్రులు, బ్యాంకులు, విమానాశ్రయాలు, నీటి ప్రాజెక్టులు, విద్యుత్ కేంద్రాలు, రక్షణ ఆయుధ కర్మాగారాలు – అన్నీ కార్పొరేట్లకు అమ్మి డబ్బు సమకూర్చుకుంటాం. ఇదంతా మీ కోసమే సిర్ఫ్ మీ కోసమే ఖర్చు పెడతాం! రాజ్యాభివృద్ధి కోసమే వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాం!''

''అయిదో రత్నం ఏంటో చెప్పలేదు'' ఎవరో అరిచారు.

''సి.ఎల్.టి. కంపల్సరీ లైఫ్ టాక్స్. బతికి వున్న వాళ్ళంతా బతికి వున్నందుకు, బతికివున్నన్నాళ్ళూ మీ సంపాదనలో 25% శాతం ప్రభుత్వానికి చెల్లించాలి...!''

★ ★ ★

మరి కొద్ది రోజులకు అడవి పొదల్లో పాత మహారాజుగారి తల నిజంగానే కనిపించింది. అది అక్కడికెలా, ఎవరి వల్ల, ఎందుకు వచ్చిందన్నది వదిలేసి, అది ఎవరి తలో నిర్ధారించే పనిలో పడ్డారు శాస్త్రవేత్తలు, మేధావులు, గూఢచారి వర్గాలు!

పాత మహారాజు తల అకస్మాత్తుగా మాయమవడం, మళ్ళీ అంతే మిస్టీరియస్‌గా దొరకడం, ఈ నిర్ధారణ పరీక్షలు ఇవన్నీ ఏవిటో ఎందుకో అర్థం కాక అయోమయంలో పడిపోయాడు కొత్త మహామంత్రి.

ఆందోళనతో ఊగిపోతూ వెళ్లి కొత్త మహారాజుని కలిశాడు.

" జనమంతా బాగానే ఉంది. అందరూ హ్యాపీగా ఉన్నారు. నువ్వెందుకు అలా లేనిపోని భయాలతో ఆందోళన పడుతున్నావు?"

"జనం తల ఊపుడు చూసి దాన్ని అంగీకారంగా తీసుకుంటున్నామేమో అని భయమేస్తోంది. భూమి లోలోపల అశాంతి నిశ్శబ్దంగా కదులుతున్నట్టుగా ఉంది మహారాజా. అది అమాంతం భూకంపంగా మారి ముంచేస్తుందేమోననే భయంతో నిద్ర కూడా పట్టడం లేదు. ఇంత దాకా తలలు వంచుకున్న వాళ్లు, తలలు ఊపిన వాళ్ళు, తలలెగరేసి పరశురాముళ్ళై మన తలలు నరకడానికి ఉరుకుతున్నట్టు పీడ కలలు వస్తున్నాయి. అంతేకాదు, సమాధుల్లోంచి కపాలాలన్నీ లేచి వచ్చి మన మీద దాడి చేసి జాంబియాల్లా పీక్కుతింటున్నట్టు ఈ తెల్లవారుజామునే పెద్ద కల వచ్చింది. అది ఎక్కడ నిజమైపోతుందోనని నాకు మా చెడ్డ భయంగా ఉంది మహారాజా!'' చిన్నగా ఏడ్చేసాడు కొత్త మహామంత్రి.

యథావిధిగా చిద్విలాసంగా నవ్వాడు కొత్త మహారాజు.

“జనాన్ని ఎప్పుడూ ఏదో ఒక మత్తులో ముంచుతున్నంతవరకూ మనం సేఫ్. అది మతం, మద్యం, ఈజీ మనీ, భోగ లాలస – ఏదైనా కావచ్చు. దానితో పాటు పాత స్కీములకు కొత్త పేర్లు, రంగుల రేపర్లు చుట్టి ఆహా ఓహో అంటూ మనమే డాన్స్ చేస్తూ జనంలోకి వదులుతూ ఉండాలి. అప్పుడిహ మళ్లీ తల ఊపుడు కార్యక్రమం మొదలవుతుంది!”

“ మరి దొరికిన తల పాత మహారాజు గారిదే కదా? ఆ సంగతి తేల్చి చెప్పి చేతులు కడుక్కోక ఆ తతంగం అంతా ఎందుకు నడిపిస్తున్నారు?”

‘‘మిస్టరీని మిస్టరీగానే వుండనియ్యి. కొన్ని తలలే నే–తలకు రక్షా కవచాలు. కానొక్కటి గట్టిగా చెప్పగలను. ఆ తల పరిశోధన తల రాజకీయాలు పూర్తిగా స‘మసి’పోయే వరకూ కొనసాగుతూనే వుంటుంది. అవసరమైతే సదరు తల తెర మీది కొస్తుంది. అనవసరమైతే చరిత్రలో సమాధి అయిపోతుంది!’’

★ ★ ★

COMMENTS